
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
బుధవారం 2 అక్టోబరు 2024



పత్తికి మద్దతు ధర

నంద్యాల రూరల్, అక్టోబరు 1: ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తికి సీసీఐ మద్దతు ధర ప్రకటించిందని నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన మంగళవారం తెలిపారు. క్వింటం రూ.7521 ప్రకారం కొనుగోలు చేయడానికి నంద్యాల పట్టణంలోని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పత్తిని కొనుగోలు కేంద్రానికి తెచ్చే ముందు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకెళ్లి రైతుసేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పత్తిలో తేమ 8 శాతం వరకు ఉండాలని, 12 శాతానికి మించి ఉన్నట్లయితే కొనుగోలు చేయబోరని చెప్పారు.







మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చంద్రబాబును సెల్ ఫోన్‌లో బంధిస్తున్న మహిళ



పుచ్చకాయలమడలో తలారి గంగమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం

ప్రతి ఇంటా సోలార్ వెలుగులు



తలారి బోయ గంగమ్మ కోరిక మేరకు టీని తాగుతున్న సీఎం చంద్రబాబు



చిన్నారిని ముద్దాడుతున్న సీఎం చంద్రబాబు

- సూర్యఘర్ పథకం ద్వారా 200 యూనిట్ల సోలార్ పవర్
- గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల నిర్మాణం
- ఓర్వకల్లు పారిశ్రామిక వాడ అభివృద్ధికి పెద్దపీట
- కర్నూలులో హైకోర్టు బెంచ్
- కరువు, వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక
- పుచ్చకాయలమడ ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు
- లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ

కర్నూలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటికి 200 యూనిట్లు సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. రూ.75 వేల వరకు రాయితీ వస్తుంది. పేదలు భరించాల్సిన లబ్ధిదారుని వాటాను ప్రభుత్వమే చెల్లిస్తుంది, ఆర్థికంగా ఉన్నవాళ్లు 300 సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు' అని సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో భాగంగా మంగళవారం పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో లబ్ధిదారులు తలారి గంగమ్మ, చింతకాయల వెంకటేశ్ ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. కుటుంబ సభ్యులతో సరదాగా కాసేపు గడిపారు. అనంతరం రూ.2.63 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ హరిత, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన ప్రజా వేదిక, పేదల సేవలో కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. 'సూపర్ సిక్స్‌లో భాగంగా వృద్ధుల పింఛన్ రూ.4వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. మెగా డీఎస్సీలో భాగంగా 16,300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. దీపావళి నుంచి 'ఇంటింట దీపం' వెలిగించాలన్న లక్ష్యంగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నాం' అని సీఎం వివరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో మిత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీతో కలిసి కూటమిగా ముందుకు సాగుతున్నామని వివరించారు. గత జగన్ ప్రభుత్వం చేసిన అరాచకాలు, విధ్వంసాలు అన్నీఇన్నీ కావని, వాటిని ఒక్కొక్కటిగా సరి చేస్తూ, పాలనను గాడిలో పెడుతున్నామని చంద్రబాబు వివరించారు.



సభ వేదికపై ఎంపీ, ఎమ్మెల్యేలు





చంద్రబాబుతో టీజీ భరత్, నాగరాజు, తిక్కారెడ్డి, తుగ్గలి నాగేంద్ర.

ఆ మూడు ప్రాజెక్టులు నిర్మిస్తాం

గత టీడీపీ ప్రభుత్వంలో పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యంలో చెరువులకు హంద్రీనీవా ద్వారా చెరువులను నింపే పథకానికి శ్రీకారం చుట్టాం. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, కేసీ కాలువ ప్రాంత అభివృద్ధికి నడుం బిగిస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక గంపెడు మట్టిని తీయలేదని చంద్రబాబు అన్నారు. ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మిస్తామని చెప్పారు. కర్నూలు జిల్లాలో కరువు వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

వివరాలు 7లో..



చింతకాయల వెంకటేశ్‌కు పింఛన్ ఇస్తున్న సీఎం



ప్రజా వేదిక సభలో పాల్గొన్న మహిళలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు



సభా వేదికపై ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, టీడీపీ నాయకులు,



ఆలయంలో పూజలు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



పెన్షన్లను పంపిణీ చేస్తున్న మంత్రి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని 12వ వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడపడం మొదలుపెట్టారని, సంక్షేమంతోపాటు అభివృద్ధి చేసి చూపిస్తున్నారని పేర్కొన్నారు. వంద రోజుల పాలనలో పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, దీపావళికి మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద లబ్ధిదారులకు కలెక్టర్ రాజకుమారి పింఛన్ అందజేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి జిల్లాలో 2,12,712 మందికి పింఛన్ పంపిణీ చేసి 97.47శాతం పంపిణీ పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.

రేపటి నుంచి దసరా సెలవులు

నంద్యాల రూరల్, అక్టోబరు 1 : దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల డీవీఈఓ సునీత వేర్వేరు ప్రకటనల్లో మంగళవారం పేర్కొన్నారు. అక్టోబరు 2 గాంధీ జయంతితో 3నుంచి ప్రారంభమైన సెలవులు 13వ తేదీ వరకు ఉంటాయన్నారు. ఇంటర్ కళాశాలలకు 3నుంచి 11వ తేదీ వరకు దసరా సెలవులతోపాటు 12న రెండో శనివారం, 13న ఆదివారం సెలవులు ఉంటాయని, 14న కళాశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు, కళాశాలల్లో జేఈఈ, నీట్ ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే ఆ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి శ్రీగిరిపై శరన్నవరాత్రులు



శ్రీశైలం, అక్టోబరు 1: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తి పీఠం శ్రీశైలం మహా క్షేత్రంలో అక్టోబరు 3 గురువారం నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ మహోత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ స్వామి అమ్మవార్లకు వాహన సేవలు ఉంటాయి. భ్రమరాంబికాదేవి వివి ధ అలంక రణలో భక్తులకు దర్శనమి వ్వనున్నారు. మహోత్సవాల సంద ర్భంగా క్షేత్రాన్ని అలంకరిస్తున్నారు. భక్తులకు దేవస్థానం అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

- గురువారం ఉదయం 8 గంటలకు అమ్మవారి యాగశాల ప్రవేశంతో దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం స్వామివారి యాగశాల ప్రవేశం, మధ్యాహ్నకాలార్చనలు, మహా నివేదన, సాయంత్రం 5 గంటల నుంచి పూజలు, గణపతి, రుద్ర, చండీ, లలితా పారాయణాలు, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం, చండీ హోమం, కాళరాత్రి పూజ, నీరాజన మంత్ర పుష్పాలు, అమ్మవారికి ఆస్థానసేవ, తీర్థప్రసాద వితరణ జరపనున్నారు. ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు, భ్రమరాంబికాదేవి అమ్మవారికి అలంకరణలు నిర్వహించనున్నారు.

దసరా ఉత్సవాలు ఇలా

వాహన సేవ	అలంకరణ
3న భృంగి వాహనం	శైలపుత్రి
4న మయూర	బ్రహ్మచారిణి
5న రావణ వాహనం	చంద్రఘంట
6న కైలాస వాహనం	కూష్మాండదుర్గ
7న శేష వాహనం	స్కందమాత
8న హంస వాహనం	కాత్యాయని
9న గజవాహనం	కాళరాత్రి
10న నంది వాహనం	మహాగౌరి
11న అశ్వ వాహనం	సిద్ధిదాయిని
12న నంది వాహనసేవ	భ్రమరాంబాదేవి నిజరూపాలంకరణ

11వ తేదీ సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పించనుంది.

తహసీల్దార్ మల్లికార్జునరెడ్డిపై చర్యలు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- మూడేళ్ల ఇంక్రిమెంట్ కట్

అవుకు, అక్టోబరు 1 : అవుకు తహసీల్దార్ మల్లికార్జునరెడ్డిపై ఎట్టకేలకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. గత నెల సెప్టెంబరు 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన భూమాయ .. ఏమాయ అనే కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. మల్లికార్జునరెడ్డి ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇంక్రిమెంట్ కట్ చేయటంతోపాటు ఇప్పటి నుంచి మరో మూడేళ్ల ఇంక్రిమెంట్ కట్ చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్‌వో) పద్మజ మంగళవారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నంద్యాల డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న మల్లికార్జునరెడ్డికి పాణ్యం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. దీంతో పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామ పరిధిలో గ్రీన్‌కో కంపెనీ నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన పొలాలకు పరిహారం అందించే విషయంలో మల్లికార్జునరెడ్డి అవకతవకలకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను తనకు అనుకూలమైన వ్యక్తులకు కట్టబెట్టి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి మీద గత ఏడాది జూలై 20వ తేదీన భూమాయ పేరుతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. వైసీపీ పెద్దల అండదండలు మల్లికార్జునరెడ్డికి పుష్కలంగా ఉండటంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. కూటమి అధికారంలోకి రావటంతో ఈ అవకతవకలపై విచారణ జరపాలని ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ బాధ్యతలు చేపట్టిన తరువాత విచారణ వేగవంతం చేశారు. మల్లికార్జునరెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావటంతో చర్యలు చేపట్టారు.

ఇక నూతన మద్యం పాలసీ

- అక్టోబరు 1నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ
- 11న లాటరీ విధానంతో షాపుల కేటాయింపు
- జిల్లాలో 105 మద్యం దుకాణాలకు టెండర్లు
- వివరాలు వెల్లడించిన జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి



నంద్యాల క్రైం, అక్టోబరు 1 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన మద్యం పాలసీకి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం నంద్యాలలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నూతన మద్యం పాలసీ విధి విధానాలను ఆయన వెల్లడించారు. కలెక్టర్ జారీ చేసిన గజిట్ నెం.39/2024 ప్రకారం జిల్లాలో 105 మద్యం షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబరు 1నుంచి 9వ తేదీ సాయంత్రం 5వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో ఏడు రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రంలో టెండరుదారులకు సహాయపడేందుకు ఒక బ్యాంక్ కౌంటర్, ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. టెండరుదారులు దరఖాస్తు చేసుకునే సమయంలో వారి మొబైల్ ఓటీపీ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఇప్పుడు చేపట్టిన మద్యం విధానంలో ఎక్కువ వివరాలేవీ అవసరం లేదని పేరు, మొబైల్ నెంబర్, ఏదైనా ఐడీ ప్రూఫ్‌తో రూ.2 లక్షల ధరావత్తును సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుందని ఆయన వివరించారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ నెల 11న ఉదయం 8గంటల నుంచి కలెక్టరేట్ ఆవరణలోని సెంటినరీ హాల్‌లో కలెక్టర్ రాజకుమారి సమక్షంలో లాటరీ విధానంలో షాపుల కేటాయింపు ఉంటుందన్నారు. మద్యం షాపుల కేటాయింపులో మున్సిపాల్టీ, నగర పంచాయతీ, మండలాల్లో జనాభా ప్రాతిపదికన రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు ధర నిర్ణయించినట్లు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలో కేటాయించే షాపులు ఆ పరిధిలోనే ఏర్పాటు చేయాలని, మండలాల్లో కేటాయించిన షాపులు ఆ మండలంలోని ఏ గ్రామంలోనైనా ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అయితే వంద మీటర్ల దూరంలో విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు, దేవాలయాలు, మసీదులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, ఆంక్షలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, సీఐ కృష్ణమూర్తి, టెక్నికల్ సీఐ సతీష్, ఎస్సైలు దౌలత్‌ఖాన్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సోలార్ వెలుగులు

5వ పేజీ తరువాయి

కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వివరించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నాడు విజన్ 2020తో ముందుకెళ్లామని, నేడు విజన్-2047 లక్ష్యంగా ముందుకెళ్తూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ముందుకెళ్తున్నామని చెప్పారు. ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధిని 2,850 ఎకరాల విస్తీర్ణంలో చేపడతామని, రూ.3వేల కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తే దాదాపు 12వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని చంద్రబాబు వివరించారు. రాయలసీమను గ్రీన్‌హబ్‌గా అభివృద్ధి చేసి 7 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని వివరించారు. రాయలసీమలో అన్ని జిల్లాలు సాగు నీటి ప్రాజెక్టులు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నాయని, కర్నూలు జిల్లాకు ఒక్కటే పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని ప్రతి ఎకరాకు నీరందించే ప్రణాళిక తయారు చేస్తామని స్పష్టం చేశారు.

పత్తికొండ నుంచి ఎమ్మెల్యేలుగా ఆ ముగ్గురు

'పత్తికొండ నుంచి కేఈ ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎంగా ఈ ప్రాంతానికి సేవలు చేశారు. ఈ ఎన్నికల్లో కేఈ శ్యాంబాబును గెలిపించారు. అలాగే ఎంపీటీసీగా ఉన్న బస్తిపాటి నాగరాజును ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించాం. అది టీడీపీకి ఉన్న పేదలపై ఉన్న ప్రేమ అని' చంద్రబాబు తెలిపారు. టీడీపీలో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తామని, జెండా మోసేవారికే భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పార్టీలో మధ్యవర్తులు ఉండరని వివరించారు. జనవరి నుంచి పీ-4 పాలసీ (ప్రైవేటు, ప్రభుత్వం, ప్రజలు, పార్ట్‌నర్‌షిప్)తో పాలసీ అమలుకు శ్రీకారం చుడతామన్నారు.

చంద్రన్నకు ఘన స్వాగతం:

జిల్లా పర్యటనలో భాగంగా పుచ్చకాయలమడ హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం చంద్రబాబుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ జి. బిందుమాధవ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి. ఆదోని టీడీపీ ఇన్‌చార్జి కే. మీనాక్షినాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు సాంబశివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడు, రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు రమాకాంత్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు పేరుపేరునా వారిని ఆప్యాయంగా పలకరించారు. నాయకులు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. అంతకుముందు మధ్యాహ్నం 12.35 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, డోన్, పాణ్యం, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ బి. నవ్య చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం సీఎంకు వినతి పత్రం అందజేశారు.



టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మిస్తాం: మంత్రి టీజీ



పత్తికొండ : పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు నిధులు ఉన్నాయని, నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ అన్నారు. పుచ్చకాలయలమడ గ్రామంలో ఆయన మాట్లాడుతూ గతంలోనే టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలసేకరణ, నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అయితే గతంలో చూసిన స్థలం యూనిట్ నిర్మాణానికి అనుకూలంగా లేకపోవడంతో వేరే ప్రాంతంలో స్థల సేకరణ చేస్తున్నామని తెలిపారు. స్థల సేకరణ పూర్తికాగానే యూనిట్ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు.

మా ప్రాంత అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పత్తికొండ: పత్తికొండ ప్రాంతం అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం పుచ్చకాయలమడ గ్రామంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని కోరారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల పరిధిలోని మరో 27 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నివేదికలు సిద్ధం చేశామని, పరిశీలించి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

ఓర్వకల్లు విమానాశ్రయంలో సీఎంకు ఘన స్వాగతం



సీఎంకు పూలబొకే ఇస్తున్న మంత్రి భరత్

ఓర్వకల్లు, అక్టోబరు 1: కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం 12.38 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. ఇక్కడి నుంచి 12.50 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో పుచ్చకాయలమడ గ్రామానికి వెళ్లారు. సీఎం చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, గిత్తా జయసూర్య, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, సోమిశెట్టి నవీన్ కుమార్, సత్రం రామకృష్ణుడు, చిన్న వెంకటస్వామి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, ఆర్డీవో శేషిరెడ్డి, దిశా డీఎస్పీ శ్రీనివాసాచారి ఘనంగా స్వాగతం పలికారు.



సీఎంకు పూలబొకే ఇస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యేలు శ్యాంబాబు, గౌరు చరిత, గిత్తా జయసూర్య, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

విమానాశ్రయంలో ధర్మవరం సుబ్బారెడ్డికి చేదు అనుభవం



విమానాశ్రయంలో ధర్మవర్మం సుబ్బారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఓర్వకల్లు, అక్టోబరు 1: కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు విమానాశ్రయానికి వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంగళవారం స్వాగతం పలికేందుకు వెళ్లిన రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ఆయన ఓర్వకల్లు విమానాశ్రయంలోకి వెళ్తుండగా.. అధికారులు ఇచ్చిన జాబితాలో ఆయన పేరు లేదని పోలీసులు అడ్డుకున్నారు. అది గమనించిన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అక్కడకు వెళ్లి ప్రొటోకాల్‌లో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరు ఎందుకు లేదని అధికారులను ప్రశ్నించారు. అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. మంత్రి ఆదేశాల మేరకు ధర్మవరం సుబ్బారెడ్డిని విమానాశ్రయంలోకి అనుమతించారు. అయితే.. మంత్రులు, ఎమ్మెల్యేల వెంట వచ్చిన ప్రముఖులను విమానాశ్రయంలోకి పోలీసులు అనుమతించలేదు. ఎండ ఎక్కువగా ఉండటంతో విమానాశ్రయ ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పించకపోవడం ఏమిటని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్ అక్టోబరు1 : అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కౌలు రైతు మద్దిలేటి (36) అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉన్న కొండికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్దిలేటి మూడు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని ఐదు సంవత్సరాలుగా సాగు చేస్తున్నాడు. ఇతనికి కుమారుడు మహేష్, కూతురు హిందు, భార్య సుగుణావతి ఉన్నారు. వీరంతా వ్యవసాయ పనులు, కూలి పనులు చేస్తున్నారు. మూడు సంవత్సరాలుగా వ్యవసాయంలో అప్పులు పెరిగిపోయి, తీర్చేదారి లేక మద్దిలేటి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. భార్య సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నందికొట్కూరు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

ఆదోని రాజకీయాలపై సీఎం ఆరా



చంద్రబాబును కలిసిన ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని, అక్టోబరు 1 : ఆదోనిలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామంలో పింఛన్ల పంపిణీ అనంతరం ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, మంత్రి భరత్‌తో ప్రత్యేక బస్సులో మాట్లాడారు. ఆదోనిలో ఇటీవల ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న విషయంపై సీఎం మాట్లాడినట్లు సమాచారం. కూటమిలో ఉన్న వ్యక్తులు బహిరంగంగా విమర్శలు చేసుకోవద్దని, ఏదైనా సమస్య వచ్చినా గుట్టుగా మాట్లాడుకోవాలని సూచించినట్లు సమాచారం. తనతో ప్రత్యేకంగా మాట్లాడాలని మీనాక్షినాయుడుకు చెప్పినట్లు తెలిసింది.

విద్యార్థులపై తేనెటీగల దాడి

పాములపాడు, అక్టోబరు 1: మండల కేంద్రమైన పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. మంగళవారం మధ్యాహ్న సమయంలో పాఠశాల మైదానంలో చివర ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ వైపు నుంచి వచ్చి మైదానంలో ఆడుకుంటున్న దాదాపు 20 మంది విద్యార్థులపై దాడి చేయడంతో పరుగులు తీశారు. పాఠశాలలో చొరబడిన తేనెటీగలు ఉపాధ్యాయులు దామరేకుల రవి, రామక్రిష్ణపై దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన వారికి చికిత్స అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు

వైద్య శాఖ కడప ఆర్డీగా రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 1: వైద్య ఆరోగ్యశాఖ కడప రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ)గా డా.బి. రామగిడ్డయ్యను నియమిస్తూ వైద్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన డా. రామగిడ్డయ్య ప్రస్తుతం విశాఖపట్నం ఆర్డీగా పని చేస్తున్నారు. 2020 ఫిబ్రవరి నుంచి 2024 మార్చి వరకు కర్నూలు డీఎంహెచ్‌వోగా 4 సంవత్సరాల 2 నెలలు పని చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన డా. రామగిడ్డయ్యను కడప ఆర్డీగా నియమించడం పట్ల వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

466 గోకులం షెడ్లకు అనుమతి

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 1: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదటి విడత 466 గోకులం షెడ్ల నిర్మాణానికి కలెక్టర్ పి.రంజిత్ బాషా అనుమతి ఇచ్చినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఇటీవల జిల్లాకు 1200 గోకులం షెడ్లు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ షెడ్లకు అర్హులైన రైతులను పశుసంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏరియా పశువైద్యశాలల ఏడీలు రైతులను ఎంపిక చేసి ఉపాధి హామీకి చెందిన ఏపీవోలకు పంపించారు. మొదటి విడతలో జిల్లాలోని 17 మండలాల్లో 466 పశువుల షెడ్లకు అనుమతి ఇవ్వగా.. ఆదోని మండలానికి 82 గోకులం షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు అనుమతి లభించింది. పత్తికొండ మండలానికి 66 పశువుల షెడ్లకు అనుమతి వచ్చింది. ఆస్పరికి 28, హాలహర్వికి 40, కోడుమూరుకు 6, సి.బెళగల్‌కు 24, గూడూరుకు 12, దేవనకొండకు 14, కోడుమూరుకు 6, కర్నూలుకు 16, క్రిష్ణగిరికి 49, ఓర్వకల్లుకు 20, నందవరానికి 17, పెద్దకడుబూరుకు 25, ఎమ్మిగనూరు 19, వెల్దుర్తికి 18, తుగ్గలికి 3 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి సంబంధించి 9.09 కోట్లు మంజూరైనట్లు జేడీ శ్రీనివాస్ తెలిపారు. లబ్ధిదారులైన రైతులు తమ వాటా కింద రూ.1.01 కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కోర్టు జోక్యంతో విడుదలైన నిందితులు

కర్నూలు(లీగల్), అక్టోబరు 1: చోరీ కేసులలో అనుమానితులను త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచకపోవడంతో వారి కుటుంబ సభ్యులు సెర్చ్ వారెంట్ దాఖలు చేయడంతో నిందితులు విడుదలైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక శరీన్‌నగర్‌కు చెందిన ఇద్దరు నిందితులు బాలకృష్ణ, మహేష్‌లను 40 చోరీ కేసులలో అనుమానితులుగా భావించి స్థానిక మూడో పట్టణ పోలీసులు మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారని నిందితుల బంధువులు తెలిపారు. దీంతో నిందితుల తరఫున న్యాయవాది సోమవారం పొద్దుపోయాక స్థానిక ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ముందు సెర్చ్ వారెంట్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు నిందితుల తరపున వారి బంధువుల స్టేట్‌మెంట్ రికార్డు చేసి అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ఈ అడ్వకేట్ కమిషనర్ నిందితుల తరఫు న్యాయవాదితో కలిసి సెర్చ్ వారెంట్ తీసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిందితుల కోసం స్టేషన్‌లో వెతికారు. స్టేషన్‌లో వారు కనిపించడంతో అడ్వకేట్ కమిషనర్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు ఇద్దరు నిందితులను అడ్వకేట్ కమిషనర్‌కు అప్పగించారు. ఆ తర్వాత ఆ అడ్వకేట్ కమిషనర్ నిందితులను తీసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడంతో వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

మళ్లీ పిచ్చికుక్క దాడి

- జోహరాపురంలో ఏడుగురికి గాయాలు
- బాధితులకు జీజీహెచ్‌లో చికిత్స



కుక్క కాటుతో ఐడీ వార్డుకు వచ్చిన జోహరాపురం చిన్నారులు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 1: కర్నూలు నగరంలో మళ్లీ పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. సోమవారం పాత నగరంలో 40 మంది చిన్నారులు, పెద్దలపై దాడి చేసి గాయపడిన ఘటన మరువక ముందే మంగళవారం ఉదయం నగరంలోని జోహరాపురంలో ఏడుగురు చిన్నారులపై దాడి చేసింది. ఇందులో ఐదేళ్ల బాలుడు స్కూల్ బస్సు ఎక్కుతుండగా వచ్చి తొడ భాగాన కరిచింది. అలాగే నగరంలోని గడ్డా వీధికి చెందిన 53 ఏళ్ల జాకీర్ హుసేన్, మరో వ్యక్తిపై పిచ్చి కుక్క దాడి చేసింది. బాధితులందరూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడంతో ఏఆర్‌వీ ఇంజెక్షన్, టీటీ ఇమినోగ్లోబిన్ టీకాలు వేసి ప్రథమ చికిత్స అందించారు.

మొత్తం 36 మందికి చికిత్స

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజులుగా కుక్క కాటుకు గురైన 36 మంది బాధితులకు చికిత్స అందించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం 27 మందికి ఏఆర్‌వీ టీటీ ఇమినోగ్లోబిన్ టీకాలు వేసి ప్రథమ చికిత్స అందించామన్నారు. మంగళవారం జోహరాపురంలో ఏడుగురు చిన్నారులు, గడ్డా వీధిలో ఇద్దరు మొత్తం 9 మంది బాధితులు కుక్క కాటుతో ఐడీ వార్డుకు వచ్చారని, వీరికి టీకాలు వేసినట్లు వెల్లడించారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లకు శ్రీకారం

దసరా నాటికి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు



ఆదోని సీసీఐ కార్యాలయం

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 1 : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జిల్లాలో పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనుంది. గత 15 రోజులుగా పత్తి ధరలు పతనమవుతుండడంతో ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్న ఉద్దేశంతో సీసీఐని రంగంలోకి దించింది. కేంద్ర ప్రభుత్వం పత్తికి ప్రకటించిన మద్దతు ధర ప్రకారం క్వింటాలు రూ.7521కు కొనుగోలు చేయనుంది. దసరా నాటికి ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. రైతులు గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పత్తిని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించుకోవచ్చని సూచించారు. రైతులు తేమ లేకుండా ఆరబెట్టుకొని విక్రయానికి తీసుకు రావాలన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సీసీఐలో విక్రయించుకున్న రైతులకు వారం రోజుల్లోపు రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మద్దతు ధర కంటే రూ.150కి పైగా అధికంగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. సీసీఐకి విక్రయించుకునే రైతులు పత్తిని విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు.


పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

నంద్యాల క్రైం, అక్టోబరు 1 : నంద్యాల రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నంద్యాల నుంచి విజయవాడకు వెళ్లే ఆయిల్ ట్యాంకర్ల గూడ్స్ రైలు రైల్వే స్టేషన్ సమీపంలోని 5వ లైన్‌లోనుంచి బయల్దేరింది. బయల్దేరిన కాసేపటికే గూడ్స్ రైలు వెనుక వున్న మూడు వ్యాగన్లు పట్టాలు తప్పడాన్ని లోకో పైలెట్ గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు, కాచిగూడ నుంచి గుంటూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు, హుబ్లీ నుంచి విజయవాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటలు ఆలస్యంగా నడిచాయి. పట్టాలు తప్పిన గూడ్స్ రైలును మరమ్మతులు చేసేందుకు గుంటూరునుంచి యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ వచ్చి మరమ్మతులు చేపట్టినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రంగురాళ్లతో గాంధీజీ పొట్రాయిట్ చిత్రం



3725 చిన్న రంగురాళ్లతో గాంధీ పొట్రాయిట్ చిత్రం

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 1: నంద్యాలకు చెందిన మురళీధర్, అర్చన దంపతుల కుమారుడు 9వ తరగతి చదువుతున్న సాహిత్ గాంధీజీ పొట్రాయిట్ చిత్రాన్ని తయారు చేశాడు. అక్టోబరు 2 గాంధీ జయంతి పురస్కరించుకొని కోటేష్ ఆర్ట్ అకాడమీలో 13.5 ఇంటూ 10 అంగుళాల పొడవు వెడల్పు గల డ్రాయింగ్ షీట్‌పై 3,725 చిన్న రంగురాళ్లను క్రమంగా అతికిస్తూ గాంధీ పొట్రాయిట్ చిత్రాన్ని తయారు చేశాడు. దీంతో కోటేష్ ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు కోటేష్ సాహిత్‌ను అభినందించారు.

మహాత్ముని అడుగు జాడ

- ఉమ్మడి జిల్లాలో రెండు సార్లు పర్యటించిన జాతిపిత
- నేడు గాంధీ జయంతి



కర్నూలు(కల్చరల్), అక్టోబరు 1: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా మహాత్ముడు జిల్లాలో 1921, 1929 సంవత్సరాల్లో పర్యటించారు. నేడు మహాత్ముని జయంతి సందర్భంగా జిల్లాతో జాతిపితకు ఉన్న అనుబంధంపై ప్రత్యేక కథనం.

. 1921 సెప్టెంబర్ 29న మహాత్ముడు రైలులో డోన్ చేరుకున్నారు. ఉదయం రావాల్సిన రైలు అర్థరాత్రి 12గంటలకు చేరుకుంది. ఆయనతో ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్, జిల్లాకు చెందిన హరి సర్వోత్తమ రావు, కొండా వెంకటప్పయ్య పంతులు.. ప్రజలతో గాంధీజీ నిద్రలో ఉన్నారని, రేపు ఉదయం మీతో మాట్లాడతారని చెప్పారు. కిందటి రోజు నుంచి జనం వేచి ఉన్నారని తెలుసుకొని గాంధీ బాధపడ్డారు. బయటకు వచ్చి జనానికి వందనం చేశారు. మహాత్ముని హిందీ ప్రసంగాన్ని కొండా వెంకటప్పయ్య పంతులు తెలుగులో అనువాదం చేశారు.

తుంగభద్ర తీరంలో మహాత్ముని సభ...

గాంధీజీ డోన్ నుంచి 1921 సెప్టెంబర్ 30న కర్నూలు చేరుకున్నారు. కర్నూలులోని ఆనాటి గాంధేయ వాదులు మేడం వెంకయ్య శ్రేష్ఠి, కామ గారి రామచంద్రరావు, లక్ష్మణ స్వామి మొదలియార్ ఆయనకు తగిన ఏర్పాట్లు చేశారు. పాతనగరంలోని మేడం వెంకయ్య శ్రేష్ఠి ఇంట్లో మహాత్ముడు బస చేశారు. ఫలాహారం పూర్తయ్యాక వెంకయ్య శ్రేష్ఠి గాంధీజీకి ఒక పళ్లెంలో వెయ్యి నూట పదహారు రూపాయల డబ్బు, ఆకు, వక్కలు పెట్టి సమర్పించారు. తుంగభద్ర ఇసుక తెన్నెలపైన మహాత్ముని సభ ఏర్పాటు చేశారు. 25 వేల మంది మహాత్ముని చూసేందుకు కదలి వచ్చారు. మహాత్ముని ప్రసంగాన్ని గాడిచర్ల అనువదించారు.

పత్తికొండలో ఖాదీ ఉద్యమ స్ఫూర్తి

1929 మే 21న మహాత్ముడు పత్తికొండలో పర్యటించారు. పత్తికొండ పంచాయతీ బోర్డు కార్యాలయం ముందున్న ఖాళీ స్థలంలో మహాత్ముని ప్రసంగం ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన మాండ్ర, ఎమ్మెల్యే



చంద్రబాబుతో మాట్లాడుతున్న మాండ్ర, ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, అక్టోబరు 1: కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును ఓర్వకల్లు విమానాశ్రయం వద్ద టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎంను కలిసిన వారిలో నంది కొట్కూరు మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి ఓర్వకల్లు విమానాశ్రయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

నందికొట్కూరు, అక్టోబరు 1: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 వసంతాల లోగోను మంగళవారం ఆవిష్కరించారు. నందికొట్కూరు పట్టణంలోని వైష్ణవి జూనియర్ డిగ్రీ కళాశాల అధినేత రవీంద్రబాబు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేఖర్ నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, నాగరాజు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ లోగో ఆవిష్కరణ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పటేల్ సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు నవీన్ కుమార్, బాలాజీ, మధు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు న్యాయం చేయాలి'

బండిఆత్మకూరు, అక్టోబరు 1: జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు ప్రైవేట్ మార్కెట్ విలువల మేరకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు, డేవిడ్ కోరారు. మంగళవారం పార్నపల్లె గ్రామంలో వాసు అధ్యక్షతన గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజును ఎన్నుకున్నారు.

'గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలి'

మహానంది, అక్టోబరు 1: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మహానంది గ్రామ శాఖ కార్యాలయంలో యు. శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు పాల్గొన్నారు.

ఆత్మకూరు మాజీ జడ్పీటీసీ మృతి



వెంకటరాముడు (ఫైల్)

ఆత్మకూరు, అక్టోబరు 1: ఆత్మకూరు మాజీ జడ్పీటీసీ వెంకటరాముడు మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఇటీవల ఆయన కిందపడిపోవడంతో మెదడుకు గాయమై చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలోనే మంగళవారం కోలుకోలేక కన్నుమూశారు. వెంకటరాముడు మృతదేహానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, గ్రామ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, లింగస్వామి, అలిబాషా, రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

గోస్పాడు, అక్టోబరు 1: చెకుముకి టాలెంట్-2024 మండల స్థాయి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. మండలంలోని గోస్పాడు మోడల్ పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో గోస్పాడు, యాళ్లూరు, దీబగుంట్ల జెడ్పీటీసీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో మోడల్ స్కూల్ విద్యార్థులు హాసిత, మహమద్ యూసుఫ్, ప్రణయ్‌కుమార్, బోయిన అమరనాథ్, ద్వితీయ స్థానంలో ప్రణయ్‌కుమార్, సాత్విక, జయంత్ నిలిచారని ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. యూటీఎఫ్ నాయకులు సోమయ్య విజయ్‌కుమార్, హరికృష్ణ, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు మస్తానయ్య, స్రవంతి, సురేఖ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

'క్రీడలను ప్రోత్సహించాలి'

పాణ్యం, అక్టోబరు 1: క్రీడలను ప్రోత్సహించాలని కడప జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి అన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ఆలిండియా సౌత్ జోన్ జేఎన్‌టీయూఏ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూఏ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు నవంబరులో కేరళ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ క్రీడల్లో మహిళా జట్టు, బెంగళూరు క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే క్రీడల్లో పురుషులు పాల్గొంటారని చెప్పారు. ఈ క్రీడల్లో జేఎన్‌టీయూఏ పరిధిలోని 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 139 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, పీడీలు నరసింహారావు, కోదండరాముడు, నవీన్‌కుమార్, వెంకటేష్, నాయక్, చంద్రారెడ్డి, విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

పాణ్యం, అక్టోబరు 1: స్థానిక గ్రామ కూడలి వద్ద జరిగిన ఇరువురి ఘర్షణలో ఒకరికి గాయాలైనట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన కొత్తూరయ్య నాగభరత్ దుకాణం వద్దకు వెళ్లి సెల్ రీచార్జ్ చేయాలని చెప్పాడు. నెట్ సమస్యతో రీచార్జ్ కాకపోవడంతో జాప్యమేర్పడింది. దీంతో కొత్తూరయ్యతో పాటు మరి కొందరు వ్యక్తులు షాపు యజమాని నాగభరత్‌పై దాడి చేశారు. దీంతో అప్పటికే కత్తెరతో పనిచేసుకుంటున్న నాగభరత్ కొట్టడానికి వచ్చిన వారినుంచి తప్పించుకునే సమయంలో కత్తెర తగిలి కొత్తూరయ్యకు గాయమైనట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల క్రైం, అక్టోబరు 1: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల టూ టౌన్ ఎస్ఐ సురేష్ ప్రజలకు సూచించారు. నేషనల్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు అబులైస్, అబ్దుల్ సమ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ సురేష్‌తోపాటు ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా.హరిఫాబాను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సైబర్ క్రైం టీం సభ్యులు రాఘవేంద్ర, ఈశ్వర్‌లు సోషల్‌మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా, డా. మహమ్మద్ రఫీ, డాక్టర్ జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

వెలుగోడు, అక్టోబరు 1: పట్టణంలోని రాజవీధి నుంచి ఎనుముల వీధికి వెళ్లే రస్తా ఆక్రమణకు గురైంది. 406/1లో సర్వే నెంబర్ గల రస్తా సుమారు 13 అడుగుల వరకు ఉండాల్సి ఉండగా కొంతమంది నివాస గృహాలు ఏర్పాటు చేసుకోవడంతో రస్తా ఆక్రమణకు గురికావడంతో 2023 జనవరి 3వ తేదిన అదే కాలనీకి చెందిన పార్వతయ్య గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. అయితే అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నంద్యాల కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పింఛన్ల పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు



వెలుగోడులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, అక్టోబరు 1: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు మంగళవారం వెలుగోడు పట్టణంలోని ద్వారక నగర్‌లో లబ్ధిదారులకు ఆయన పించన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశల వారిగా ఇచ్చిన హామీలను నేరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రం సంక్షభంలో ఉన్నా సంక్షేమం చేస్తున్న ఘనత ఒక్క టీడీపీకే సాధ్యమన్నారు. అధికార పగ్గాలు చేపట్టిన వంద రోజుల్లో వంద పనులకుపైగా పూర్తి చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. టీడీపీ నాయకులు అబ్దుల్ ఖలీల్, పాల శంకర్‌రెడ్డి, ఎల్లాల కృష్ణుడు, జాకీర్ హుస్సేన్, రామనాయుడు, వీరభద్రుడు, జనసేన నాయకులు శాలుబాషా, సుకన్య, ఎంపీడీవో అమానుల్లా, తహసీల్దార్ శ్రీనివాసగౌడు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలంలో మంగళవారం లబ్ధిదారులకు వివిధ రకాల ఎన్టీఆర్ భరోసా పింఛన్లను విజయవంతంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. మండలంలోని మసీదుపురం గ్రామంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి, తమ్మడపల్లిలో టీడీపీ నాయకుడు శ్యామల జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటా తిరిగి పింఛన్లను అందజేశారు. సాయంత్రానికి 90 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

నందికొట్కూరు రూరల్: గ్రామస్థాయి నుంచి అన్నిరంగాలలో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. అలాగే ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని 10 బొల్లవరం గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. అక్టోబరు 1వ తేదిన ఉదయాన్నే గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ అందరి క్షేమ సమాచారం తెలుసుకుంటూ వృద్ధులను పేదలను, పెద్దలను అందరనీ బాగోగులు అడుగుతూ పలకరించుకుంటూ అర్హులైన వారికి ఇంటివద్దనే స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు.

● అల్లూరు గ్రామంలో తెలుగుదేశం సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటూ అర్హులైన వారికి పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలో మంగళవారం 93 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలోని 25 గ్రామాలలో స్థానిక టీడీపీ నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. మిగతా పింఛన్లను రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పగిడ్యాల: మండలంలోని బీరవోలు గ్రామంలో టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ చిమ్మె బిచ్చన్న ఎన్టీఆర్ భరోసా ఫించన్లను మంగళవారం పంపిణి చేశారు. మండల వ్యాప్తంగా 97 శాతం ఫించన్లు పంపిణి చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాఘవనాయుడు, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచర్ల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5005 పింఛన్లు ఉండగా 4807 పింఛన్ల పంపిణీ పూర్తి చేసి 96శాతం నమోదు అయిందని ఇన్‌చార్జి ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ పాల్గొన్నారు.



బొల్లవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయానికి 97.05 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు సోషల్ వెల్ఫేర్ డీడీ, మండల ప్రత్యేక అధికారి చింతామణి, ఎంపీడీవో మేరీ తెలిపారు. మంగళవారం వారు ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో మొత్తం అన్ని రకాల పింఛన్లు 4,206కు గానూ సాయంత్రానికి తమ సిబ్బంది ఆధ్వర్యంలో 4,082 పింఛన్లు పంపిణీ చేయడంతో 97.05శాతం నమోదైనట్లు చెప్పారు. ఇంకా 124 పింఛన్లు కూడా బుధవారం పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: తమ్మరాజుపల్లెలోని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు, ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు దుబాయ్ శీను, శివశంకరరెడ్డి, సురేష్, నాగేష్, కృష్ణ, నాగరాజు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

'విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరించ వద్దు'



రిలే దీక్షలో పాల్గొన్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

నంద్యాల రూరల్, అక్టోబరు 1: విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరించవద్దని, దాన్ని ఆపేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కడప స్టీల్‌ప్లాంట్ సెయిల్ ద్వారా ప్రారంభించాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారివద్ద మంగళవారం నిరాహార దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ నాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. వామపక్ష అనుబంధ సంస్థల నాయకులు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

'రక్తదానానికి ముందుకు రావాలి'



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల రూరల్, అక్టోబరు 1: ప్రతి ఒక్కరూ రక్తదానికి ముందుకు రావాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ పిలుపునిచ్చారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురురామవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. విజయ బ్లడ్‌బ్యాంక్ నిర్వహణలో డా.రవికృష్ణ గురురామవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, శేక్షావలిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కోచింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నిజాముద్దీన్, నాగరాజు, చంద్రశేఖర్, విజయ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి సద్దాం, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

జూపాడుబంగ్లా, అక్టోబరు 1: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం సిబ్బంది జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తెరవకుండా తాళాలు వేసి సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ పరమేష్, సేల్స్‌మెన్స్, వాచ్‌మన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మద్యం దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి



మృతి చెందిన అక్బర్‌బాషా

పాణ్యం, అక్టోబరు 1: స్థానిక చందమామ హోటల్ వద్ద నిలిచిన ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతిచెందడంతో పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం సంగారెడ్డి నుంచి తిరుపతికి బయలు దేరిన బస్సు భోజనానికి చందమామ హోటల్ వద్ద నిలపడంతో కండక్టర్ ప్రయాణికుడు మృతి చెందినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వ్యక్తి హైద రాబాదు నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్నాడని చెప్పారు. మృతుడు ఆళ్లగడ్డకు చెందిన టైలర్ అక్బర్‌బాషాగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు. గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు.

'టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, అక్టోబరు 1: టీడీపీ సభ్యత్వ నమోదు గుర్తింపు మాత్రమే కాదని తెలుగు జాతి ఆత్మగౌరవం, అభ్యున్నతికి పాటుపడుతుందని, సభ్యత్వం తీసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. మంగళవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమ కార్యాచరణపై కౌన్సిలర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, వార్డు ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం గొప్ప చారిత్రాత్మక నిర్ణయమని, రూ.100చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వం ద్వారా కార్యకర్తకు అనుకోని ఘటన జరిగినపుడు రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించడం దేశ చరిత్రలో ఏ పార్టీ ఇలాంటి నిర్ణయం చేపట్టలేదని గుర్తుచేశారు. అధిక సభ్యత్వాలతో నంద్యాలను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో పెట్టాలని ఆకాంక్షించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు, అక్టోబరు 1: మండలంలోని ఎర్రగుంట్ల శివారులోని కెసీ కెనాల్ సబ్ చానల్ కాలువలో మృత దేహం లభ్యం అయినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్ళిన కూలీలకు దుర్వాసన రావటంతో కెనాల్‌లో చూడగా మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచార ఇచ్చారన్నారు. ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించగా మృతదేహం బాగా కుళ్లి పోయినదని, నంద్యాల నుంచి వైద్యుడిని రప్పించి అక్కడ శవ పరీక్షలు చేయించామన్నారు. డాక్టర్ పరీక్షల ప్రకారం మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి షర్టు ఎరుపు, నలుపు గడులతో కూడి ఉన్నదని, టైలర్ ఉస్మాన్ నంది కొట్కూరు అని ఉన్నదని ఎస్ఐ తెలిపారు. సంబందీకులు ఎవరైనా తెలిసిన వెంటనే బండిఆత్మకూరు పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసులు

పాణ్యం, అక్టోబరు 1: టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పాణ్యానికి చెందిన చిట్టిబోయిన శ్రీనివాసులు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా టెలికాం జీఎం తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన అధికారిక ప్రకటన జారీ చేశారు. రెండేళ్ల వరకు సభ్యులు అడ్వైజరీ కమిటీలో కొనసాగుతారన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి సభ్యులు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు

రెండో రోజు కొనసాగిన విచారణ

ఆత్మకూరు, అక్టోబరు 1: ఆత్మకూరు పట్టణంలోని కేడీసీసీ బ్యాంకులో జరిగిన అవకతవకలపై రెండో రోజైన మంగళవారం బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్ రూ.78.77లక్షల వ్యక్తిగత అవసరాలకు దారిమళ్లించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే క్యాషియర్ బ్యాంకు లావాదేవీల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో నగదును భద్రపరిచే సమయంలో పీవో సంబంధిత నగదును పరిశీలించి సరిచూసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇదే బ్రాంచ్‌లో పీవోగా విధులు నిర్వహిస్తున్న రంగయ్య నగదు నిల్వలపై అసలత్వం వహించడంతోనే క్యాషియర్ అల్తాఫ్ దర్జాగా రూ.78.77 కాజేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో బ్యాంకు సొమ్మును మాయం చేసిన అల్తాఫ్‌తో పాటు విధుల్లో అలసత్వం వహించిన రంగయ్యను సోమవారం కేడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే మంగళవారం కేడీసీసీ బ్యాంకు సీఈవో విజయకుమార్, నంద్యాల రీజనల్ జీఎం శివలీల, డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి బ్యాంకును సందర్శించి నగదు కాజేసిన క్యాషియర్ అల్తాఫ్‌తో పాటు విధుల్లో అలసత్వం వహించిన రంగయ్యను విచారించారు. ఈ విచారణలో క్యాషియర్ అల్తాఫ్ తాను వాడుకున్న డబ్బును తిరిగి చెల్లిస్తానని ఉన్నతాధికారులు తెలియజేసినట్లు తెలిసింది. ఇదిలావుంటే బ్యాంకులో జరిగిన ఈ అవకతవకలపై ఉన్నతాధికారులు ఏం చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వీరభద్ర స్వామికి వెండి కిరీటం



వెండి కిరీటాన్ని అందిస్తున్న భక్తుడు

శ్రీశైలం, అక్టోబరు 1: శ్రీశైలం క్షేత్రంలోని వీరభద్రస్వామికి మంగళవారం శ్రీశైలం కొత్త పేటకు చెందిన డి.పుల్లయ్య వీరభద్ర స్వామికి వెండికిరీటం, వెండిపళ్లెం సమర్పించారు. ఆకుపచ్చ రాయితో కూడిన వెండికిరీటం బరువు 800 గ్రాములు, వెండి పళ్లెం 290 గ్రాముల బరువు ఉంటుందని దాత తెలిపారు. ఈ విరాళాన్ని దాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఉమానాగేశ్వరశాస్త్రి, పర్యవేక్షకులు అయ్యన్నకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు హైదరాబాద్‌కు చెందిన విజయగోపాల్, రేఖారాణి పట్టువస్త్రాలను సమర్పించారు. మొత్తం 53 పట్టుచీరలు, 10 పంచెలను దాత అందజేవారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాత వీటిని ప్రధాన అర్చకులు మార్కండేయశాస్త్రి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

దసరా మహోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మహానంది, అక్టోబరు 1: మహానంది దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు కోసం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందచేసి ఆహ్వానించారు. మంగళవారం వేల్పనూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, ఆశీర్వదించారు. అనంతరం దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ పాల్గొన్నారు.


టూరిస్టు డార్మెటరీ నిర్వహణకు వేలం పాటలు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 1: ఏపీ టూరిజం, నంద్యాల జిల్లా పర్యాటక శాఖ ఆధీనంలోని బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రం వద్ద ఉన్న టూరిస్ట్ డార్మెటరీకి సంబంధించి మంగళవారం నంద్యాల జిల్లా టూరిజం కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ముగ్గురు వ్యక్తులు పాల్గొనగా అధిక మొత్తంలో బనగానపల్లెకు చెందిన మల్కిరెడ్డి దస్తగిరిరెడ్డి రూ.3,84,680లకు పాట పాడి దక్కించుకున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ వేలం పాటలో దేవదాయశాఖ, సమాచారశాఖ, పర్యాటకశాఖ కు చెందిన అధికారులు పాల్గొన్నారు. అధికమొత్తం తో తీసుకున్న వారు రెస్టారెంట్, పరిసరాలను అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు ఏర్పాటుచేసి నిర్వహించుకోవాల్సి ఉంటుందని పర్యాటకశాఖ అధికారి తెలిపారు.

వేల్పనూరులో చోరీ

వెలుగోడు, అక్టోబరు 1: మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి 16 తులాల బంగారం, రూ.30 వేలు నగదు ఎత్తుకెళ్లారు. పోలీసుల తెలిపిన వివరాలివీ.. వేల్పనూరుకు చెందిన వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం కర్నూలుకు వెళ్లారు. వారు సోమవారం రాత్రి తిరిగి వేల్పనూరు చేరుకున్నారు. ఆ సమయంలో ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మకూరు సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి వేల్పనూరుకు చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి'



కోడింగ్‌పై శిక్షణ ఇస్తున్న నెక్స్‌స్కిల్స్ 360 సహ వ్యవస్థాపకురాలు

గడివేముల, అక్టోబరు 1: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు జిందాల్ పరిశ్రమ ప్రత్యేక దృష్టి సారించిందని సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు సాంకేతిక విద్య, నైపుణాభివృద్ధిని పెంపొందించేందుకు నెక్స్‌స్కిల్స్ 360 సంస్థతో ఉచితంగా కోడింగ్‌పై శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మంగళవారం కోడింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నెక్స్‌స్కిల్స్ 360 సంస్థ సహ వ్యవస్థాపకులు సౌజన్య మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయి విద్యా సంస్థలు, కార్పొరేట్ స్కూళ్ల తరహాలో మండలంలో 11 ప్రభుత్వ స్కూళ్లలో జిందాల్ సహకారంతో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. నెట్, కరెంట్, కంప్యూటర్ లేకుండానే కార్డ్‌బోర్డ్ స్కిట్‌ల ద్వార విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇస్తామని అన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ: మండలంలోని 6 హైస్కూళ్లకు చెందిన 551 మంది విద్యార్థులకు రూ.9 లక్షల విలువగల స్టడీ మెటీరియల్‌ను జిందాల్ పరిశ్రమ యాజమాన్యం పంపిణీ చేసింది. మెటీరియల్‌ను ఎంఈవో విమల వసుంధరాదేవి, సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ ఆయా హైస్కూళ్ల హెచ్ఎంలకు అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. గడివేముల హైస్కూల్ హెచ్ఎం విక్టర్ ఇమ్మానుయేలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థను బలోపేతం చేస్తాం: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 1: నంద్యాల జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రెడ్‌క్రాస్ సంస్థను బలోపేతం చేస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం రామక్రిష్ణ పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతిప్రజల్వన అనంతరం రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామక్రిష్ణ విద్యా సంస్థల నుంచి 60 మంది విద్యార్థులు రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో భవిష్యత్తులో బ్లడ్‌స్టోరేజ్ సెంటర్స్ బ్లడ్‌సెంటర్, సీపీఆర్ ఫస్ట్ ఎయిడ్, డిజాస్టర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. డా.రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థకు ఎళ్లవేలా సహకరిస్తామన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ మారుతి కుమార్, ట్రెజరర్ నాగేశ్వరరావు, కాలేజీ మేనేజర్ ప్రగతిరెడ్డి, రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపాదనలు సిద్ధం చేయాలి'

గ్రీన్‌కో ఎలక్ట్రికల్ పవర్ ట్రాన్స్మిషన్ ఏర్పాటుకు సంబంధించి షెడ్యూల్ కులాల హక్కులకు భంగం కలగకుండా సబ్ డివిజనల్ కమిటీ సూచించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్‌కో ఎలక్ట్రికల్ పవర్ లైన్‌ట్రాన్స్మిమిషన్ ఏర్పాటు నిమిత్తం డోన్ డివిజన్ పరిధిలో 13.23 హెక్టార్లుకు సంబంధించిన భూములు షెడ్యూల్ కులాల వారికి భంగం కలగకుండా గ్రామ సభలలో తీర్మానించిన ప్రతిపాదనలను జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి సబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ విష్ణుచరణ్, ఐటీడీఏ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజకుమారి

'పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి'

ఓటర్ల సవరణకు స్వీకరించి పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ ను పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తన కార్యాలయం నుంచి ఓటర్ల సవరణ ప్రక్రియ 2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా మలుపులు

- నంద్యాల-గిద్దలూరు రహదారిలో తరచూ ప్రమాదాలు
- మలుపుల్లో కనిపించని సూచిక బోర్డులు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు

నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలోని మలు పులు ప్రమాదాలకు నెలవుగా మారా యి. నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో కొందరు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు క్షతగాత్రుల వుతున్నారు. ప్రధాన రహదారి మలుపుల్లో పలు చోట్ల సూచిక బోర్డు లు లేక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అరకొరగా ఉన్న సూచిక బోర్డుల్లో కొన్ని విరిగి పోగా, మరికొన్ని చెట్ల మధ్యలో కనిపించకుండా ఉన్నాయి. సూచిక బోర్డుల ఏర్పాటు, నిర్వహణ పట్ల సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

శిరివెళ్ల, అక్టోబరు 1 : నల్లమల అటవీప్రాంతం శిరివెళ్ల, మహానంది మండలాల్లోని గ్రామాల నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు విస్తరించి ఉంది. దట్టమైన రిజర్వు ఫారెస్టులో ఉన్న నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో చాలా చోట్ల ప్రమాదకరమైన ఘాట్‌లు, మలుపులు ఉన్నాయి. ప్రయాణికులు ప్రమాద ప్రాంతాలను ముందుగా గుర్తించేందుకు అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఘాట్ రోడ్డు కావడం, మలుపులు ఎక్కువగా ఉండడంతో భారీ వాహనాలు, మలుపుల్లో ఉన్న కల్వర్టులను ఢీకొని వాహనాలు, ప్రయాణికులు లోయలో పడి మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. నల్లమల ఘాట్‌లోని మలుపుల్లో ఐదేళ్ల వ్యవధిలో దాదాపు మూడు వందల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో వంద మంది వరకు మృతి చెందగా 450 మంది గాయాల పాలయ్యారు.



నల్లమల అటవీ ప్రాంతం రహదారిలో మలుపులు

వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల పరిధిలోని సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి ప్రకాశం జిల్లాలోని దిగువమెట్ట గ్రామం వరకు రహదారి మొత్తం అటవీప్రాంతంలో ఉంది. రిజర్వు ఫారెస్టు కావడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండవు. దీంతో ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించేందుకు ఆటకం ఏర్పడుతోంది. అత్యవసర సమయంలో క్షతగాత్రులకు అందాల్సిన వైద్య సేవలకు అంతరాయం కలుగుతోంది. రహదారిలో వెళ్తున్న ఇతర ప్రయాణికులు అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చాక మాత్రమే ప్రమాద ఘటనల గురించి హైవే పెట్రోలింగ్ సిబ్బందికి, పోలీసులకు తెలియజేయాల్సి వస్తోంది. రహదారిలో భారీ వాహనాలు బోల్తాపడినా.. ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నా భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే అభయారణ్యంలో ప్రయాణికుల అవస్థ లు వర్ణనాతీతం. రహదారి పైనే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.



నంద్యాల-గిద్దలూరు రహదారిలో కూలిన కల్వర్టు

ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన లారీ (ఫైల్)

అధికారులు చర్యలు తీసుకోవాలి



నంద్యాల-గిద్దలూరు రహదారిలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆర్ అండ్‌బీ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేసి రహదారిలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో రహదారి ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలి.

- చిన్నా, మహదేవపురం

అవగాహన కల్పిస్తున్నాం



రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. శిరివెళ్ల, మహానంది మండలాల పోలీస్ సిబ్బంది ప్రతిరోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఘాట్ రోడ్డులో అధిక లోడుతో వెళ్లడం, అతివేగంతో ప్రయాణిస్తుండడంతో మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.

- చిన్న పీరయ్య, ఎస్ఐ, శిరివెళ్ల

ఆర్చరీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు

రుద్రవరం, అక్టోబరు 1 : రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఆదర్శ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మంగళవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. సెప్టెంబరు 30న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలోని ఆర్చరీ పోటీల్లో ఎల్.మానస, పి.వెంకటశ్రీవల్లి, జి. క్యాథలిన్, వీఆర్ జగదీశ్వర్ జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీడీ శ్రీనివాసులను అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, పీడీ గంగాదేవి, అధ్యాపకులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు హర్షవర్ధన్, శ్రీవర్ధన్, అబ్దుల్లా, రవికుమార్, పార్థసారధి, ఆఫ్రీద్‌ను అభినందించారు.

వృద్ధులతో స్నేహపూర్వకంగా మెలగాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 1: వయో వృద్ధులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆళ్లగడ్డ సీహెచ్‌సీ వైద్యాధికారి శబరీష్ అన్నారు.ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీహెచ్‌సీ నుంచి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీహెచ్‌సీలో ప్రత్యేక ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలోగల వృద్ధాశ్రమంలో మంగళవారం వైద్యులు అంజలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వివిధ వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమగ్రంగా విచారించాలి



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 1 : ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన ఇసుకను పక్కదారి పట్టిన ట్లు వస్తున్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులోని ఇసుక నిల్వ కేంద్రం వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సొమ్మును కాపాడాల్సిన బాధ్యత అధికారులుపై ఉందన్నారు. మార్కెట్ యార్డు, న్యాయస్థానం పరిసరాల్లోని సీసీ కెమెరా లను పరిశీలించి బాధ్యులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయా లన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

400 మెట్రిక్ టన్నుల ఇసుక పక్కదారి

- హౌసింగ్ ఏఈపై చర్యలకు నివేదిక: డీఈ నాగరాజు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) అక్టోబరు 1: ఆళ్లగడ్డ పరిధిలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు స్థానిక మార్కెట్‌యార్డ్‌లో నిల్వ ఉంచిన ఇసుకలో 400 మెట్రిక్ టన్నుల ఇసుక పక్కదారి పట్టినట్లు గుర్తించామని హౌసింగ్ డీఈ నాగరాజు మంగళవారం తెలిపారు. పేదలకు అందాల్సిన ఇసుక గుట్టు చప్పుడు కాకుండా పక్కదారి పట్టడంతో గృహ నిర్మాణశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్రంగా విచారించి నివేదిక అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇసుకను పర్యవేక్షించాల్సిన ఆళ్లగడ్డ హౌసింగ్ ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు డీఈ నాగరాజు తెలిపారు. పక్కదారి పట్టిన 400 మెట్రిక్ టన్నుల ఇసుక విలువ దాదాపు రూ.87 వేలు ఉంటుందని డీఈ తెలిపారు.

మంత్రి బీసీని కలిసిన సుబ్బారెడ్డి



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు

డోన్, అక్టోబరు 1: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మంగళవారం రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు మర్యాదపూర్వంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి నివాసంలో బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మలను ధర్మవరం సుబ్బారెడ్డి, ఆయన సతీమణి మల్లేశ్వరి, కుటుంబ సభ్యులతో పాటు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు దంపతులు, పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున గజమాలతో సన్మానించారు. అదేవిధంగా టీడీపీ నాయకులు ధర్మవరం పెద్దనాగిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, న్యాయవాదులు అలా మల్లికార్జున రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు మంత్రి బీసీ దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కోట్ల



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 1: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఓర్వకల్లు విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కోట్ల స్వాగతం పలికారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి సీఎంకు ఎమ్మెల్యే కోట్ల వినతిపత్రం అందజేశారు. డోన్ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టు, మైనింగ్ కళాశాల, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

సీఎంను కలిసి రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

ఓర్వకల్లు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. సీఎంను శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు విరాళం

బనగానపల్లె, అక్టోబరు 1 : విజయవాడ వరద బాధితులకు బనగానపల్లె పట్టణ ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు రూ.42వేలు విరాళం అందజేశారు. మంగళవారం మంత్రి బీసీ జనార్ధనరెడ్డి కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు ఆయనను కలిసి చెక్కును అందజే శారు. పాఠశాలల యజమాన్యం, విద్యార్థుల విరాళాల ద్వారా ఈ మొత్తాన్ని సేకరించినట్లు వారు తెలిపారు.

మిరప సాగుపై అవగాహన పెంచుకోవాలి



నర్శిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుధాకర్

ఉయ్యాలవాడ, అక్టోబరు 1: మిరప పంటసాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధకర్ తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం హరివరం, నర్శిపల్లె, పడిగెపాడు గ్రామాల్లో ఏడీఏ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప పంట సాగులో మెలకువలు పాటించాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడరాదన్నారు. డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 65వేల ఎకరాల్లో పంట సాగు అయ్యిందన్నారు.

25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు

రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే శనగ పంటకు 25 శాతం సిబ్సిడీతో శనగ విత్తనాలు మంజూరు చేస్తున్నామని వ్యవసాయ ఏడీఏ సుధాకర్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఈ ఏడాది 1,15,000 ఎకరాల్లో శనగ పంట సాగు అయ్యే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 22 వేల క్వింటాల విత్తనాలు అవసరం అయినట్లు గుర్తించి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం పూర్తి ధర క్వింటా రూ. 9 వేలు కాగా ప్రభుత్వ సబ్సిడీపోను రైతులు రూ. 7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అక్టోబరు మూడు నుండి రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

- డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి తంగమణి

డోన్(రూరల్), అక్టోబరు 1: శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులు పెంచుకోవాలని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు పరీక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, మండల విద్యాధికారి ప్రభాకర్, రామనర్సప్ప, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, ఎంఎస్‌బాబు, ఎస్టీయూ నాయకులు రమణ, మౌలాలి పాల్గొన్నారు.

శిరివెళ్ల: విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం సూచించారు. చెకుముకి సైన్స్ పరీక్షల పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు లావణ్య, సత్య ప్రకాష్, రాకేష్ ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట రమణ, కృష్ణారావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



నందవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 1 : నిరుపేదలకు ఆర్థికసాయం అందించి వారిని అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె మండల పరిధిలోని నందవరం గ్రామంలో పింఛను పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షోభంలో కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ బనగానపల్లె మండల అధ్యక్షుడు పీవీ కుమార్‌రెడ్డి, వెంగన్న పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మోపూరి రాము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరం మండలంలో మంగళవారం పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. మండలంలోని 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో 6298 పింఛన్లుదారులు ఉండగా 6071 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. పింఛన్లు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.

చాగలమర్రి: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని మల్లేంవీధి, గుంతపాలెం వీధుల్లో టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళి, నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : కూటమి ప్రభుత్వం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఒకటవ తేదీనే రంచన్‌గా అందిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంకి రెడ్డి పల్లె గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 7066 పింఛన్లు ఉండగా, 6855 పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసి, 97.58 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి తెలిపారు.



ప్యాపిలి: ఏనుగమర్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావుయాదవ్

ఆసుపత్రిలోనే పింఛను పంపిణీ

రుద్రవరం : రుద్రవరం గ్రామానికి చెందిన సచివాలయం-1 పరిధిలో ఉన్న పగిడి మరియమ్మకు నంద్యాల శాంతిరామ్ వైద్యశాలలో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంటు దివ్యవాణి పింఛను పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళకు అక్కడికే వెళ్లి రూ.4వేలు పింఛను పంపిణీ చేశారు. ఆసుపత్రిలో ఒక కాలు తొలగించి చికిత్స పొందుతున్న మహిళకు పింఛను పంపిణీ చేయడంపై ఉద్యోగినిని ప్రశంసించారు.

శిరివెళ్ల: ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గోవిందపల్లె టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవి చంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అధికారులతో పాటు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు.



కొలిమిగుండ్ల: పింఛన్ పంపిణీ చేస్తున్న నంద్యాల రామేశ్వరరెడ్డి



రుద్రవరం: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మధుసూదనరెడ్డి

నేటి నుంచి వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు

రుద్రవరం, అక్టోబరు 1 : రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో బుధవారం నుంచి వన్యప్రాణి సంరక్షణ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రేంజర్ శ్రీపతినాయుడు మంగళవారం తెలిపారు. నేటి నుంచి ఈనెల 8వరకు ఏడురోజుల పాటు వన్యప్రాణి సంరక్షణ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రేంజ్ పరిధిలోని నల్లమల అడవుల సమీప గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే వన్యప్రాణుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలి

ఉయ్యాలవాడ, అక్టోబరు 1: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహిస్తున్న గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఉపాధిహామీనే కీలకమన్నారు. ప్రతి గ్రామంలో తొలి గ్రామ సభ నిర్వహించాలన్నారు. అలాగే గ్రామాల్లో పండ్ల తోటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో రవిప్రకాష్, ఈసీ షరీఫ్, ఆయా గ్రామాల టీఏలు ఉన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో గ్రామాల్లో ఉపాధి హామీ కింద పనులు చేపట్టడానికి కావలసిన ప్రణాళిక తయారు చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు హాజరై పొలాల్లో ఉపాధి పనులు చేయించుకునేందుకు అధికారులకు తెలపాలన్నారు. సిబ్బంది గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించి నివేదికలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన మసీదు ప్రారంభం

సంజామల, అక్టోబరు 1: మసీదు నిర్మాణానికి టీడీపీ నాయకులు కాట్రెడ్డి వెంకట కృష్ణా రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు సహాయ సహకారాలు అందించారని సంజామల అమీర్ సాబ్, నబీరసూల్ అన్నారు. మంగళవారం మండలంలోని మిక్కినేనిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక నమాజులు చేశారు. కార్యక్రమంలో సంజామల అన్వర్ మౌలాన, వినుకొండ మౌలాన, ముస్లిం పెద్దలు, పలు గ్రామాలకు చెందిన ముస్లింలు బాషా, మదార్ వలి, మదార్ బాషా, షరీఫ్ పాల్గొన్నారు.

రేనాటి సూర్యచంద్రుల సేవా సమితికి అవార్డు



రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి అధ్యక్షుడు డీకే బాబుకు అవార్డును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఉయ్యాలవాడ, అక్టోబరు 1: తొలిస్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద రక్తదాన శిబిరాలకుగాను అవార్డు లభించింది. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం నంద్యాలలోని రెడ్ క్రాస్ సంస్థ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులు ప్రకటించారు. అవార్డును రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి అధ్యక్షుడు డీకే బాబుకు రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్, కలెక్టర్ రాజకుమారి అందించారు. మండల ప్రజలు, అధికారులు, నాయకుల సహకారంతోనే ఈ అవార్డు లభించినట్లు సభ్యులు తెలిపారు.

పంట నమోదు పరిశీలన

డోన్(రూరల్), అక్టోబరు 1: జిల్లా వ్యవసాయాధికారి మురళికృష్ణ, డోన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్ వర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కొచ్చెర్వు, వెంకటనాయునిపల్లె గ్రామాల్లో పంట నమోదును గ్రామ వ్యవసాయ సహాయకులు పరిశీలించారు. పంట నమోదుతో పాటు సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కోవెలకుంట్ల, అక్టోబరు 1 : కోవెలకుంట్ల ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్‌నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కోవెలకుంట్లలో విధులు నిర్వర్తించిన ఎస్ఐ నరసింహులు కడప జిల్లా బద్వేలుకు బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా ఉరవకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసే ప్రవీణ్‌కుమార్‌నాయక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

శరన్నవరాత్రుల బ్రోచర్లు ఆవిష్కరణ

చాగలమర్రి, అక్టోబరు 1: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల బ్రోచర్లను ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మా ట్లాడుతూ 3 నుంచి 14వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఆలయంలో చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులతో పల్లకీ సేవా, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రోహితిశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాదరెడ్డి, వెంకటరమణ, నరసింహ, నారాయణ, గంగుల బాస్కర్, కృష్ణయ్యయాదవ్, దస్తగిరి, సురేష్ పాల్గొన్నారు.

శ్రీవాసవీ కన్యకారమేశ్వరి ఆలయంలో..

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీవాసవీ కన్యకారమేశ్వరి ఆలయంలో ఈ నెల 3 నుంచి 13వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనునట్లు పట్టణ ఆర్యవైశ్యసంఘం ప్రెసిడెంట్ పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజూ ఒక అలంకారంతో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. 13న తెప్పోత్సవం కార్యక్రమాలుంటాయని తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

చాగలమర్రి, అక్టోబరు 1: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని రాష్ట్ర పీఆర్టీయూ కౌన్సిలర్ రవీంద్రారెడ్డి కోరారు. మంగళవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, డీఏ, హరియర్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కౌన్సిలర్ నారాయణ మూర్తి, సంఘ నాయకులు నరసింహారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దాదాపీర్, సుబ్రమణ్యం, సహదేవరెడ్డి, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, మద్దిలేటి, హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

డోన్, అక్టోబరు 1: ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన శ్రీసుధ పాఠశాల విద్యార్థిని శ్రీకృతి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కర్నూలు నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం శ్రీసుధ పాఠశాల యజమాన్యం సుదర్శన్, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రీకృతికి మెమోంటో అందజేసి అభినందనలు తెలిపారు.

టమోటా .. మళ్లీ రారెత్తిస్తోంది

కొలిమిగుండ్ల, అక్టోబరు 1: టమోటా ధరలు మళ్లీ రారెత్తిస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు అదుపులోనే ఉన్న టమోటా ధరలు ఒక్కసారిగా రూ. 80కి చేరి కొండెక్కడంపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జూలై మాసంలో సెంచరీ కొట్టిన టమోటా ఆగస్టులో కాస్తా సామాన్యుడికి అందుబాటులోకి వచ్చింది. వారం రోజులుగా పెరుగుతున్న టమోటా ధరలు మంగళవారం బహిరంగ మార్కెట్లో రూ.80కి చేరడంతో వినియోగదారులు భయపడిపోతున్నారు.